
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

శుక్రవారం 18 అక్టోబరు 2024



నిరసన తెలుపుతున్న యాజమాన్యాలు(ఫైల్)

బకాయిల భారం తీర్చండి

- డిగ్రీ కళాశాలల యజమానుల ఆందోళన బాట
- మూడేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్
- రూ.20.37 కోట్ల బకాయిలు

8



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ
- నివాళులు అర్పించిన ఎస్పీ

8

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. నాయకులు సతీష్, రవి, శ్రీనివాస్, బాలయ్య, సతీష్, మధు, మహేశ్, చంద్రయ్య, అంజయ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి మండలం బంజేరుకు చెందిన తుడు రాజెల్లయ్యకు 45 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీటీ యాదవ్, గ్రామ అధ్యక్షుడు పర్లపల్లి దేవయ్య అందజేశారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ చంద్రమౌళి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ముస్తాబాద్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్యువల్ స్టూడెంట్స్ కాంపిటీషన్ ఈవెంట్ 2024 పోటీల్లో మండలంలోని ఆవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 'కుటుంబాన్ని సంరక్షించే పనికి మహిళలకు వేతనం చెల్లించవచ్చా వివరించండి' అనే అంశంలో నిర్వహించిన వ్యాస రచనపోటీల్లో ఎండీ బూష్రా, ఏర్పుల దేవిక, బత్తుల నిఖిల్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. 'చిన్న కుటుంబం ఒక వరం శాపం కాదు, ఉమ్మడి కుటుంబంతో విభేదించండి' అనే అంశంపై డిబేట్ పోటీల్లో బండి అశ్విత, గంగాడి స్నేహిత, రేగుల సాహితీ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందారు. గైడ్ టీచర్‌గా ఆడెపు గణేశ్, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు వ్యవహరించారు. ప్రథమ స్థానాన్ని పొందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.12 వేల నగదు, ప్రశాంస పత్రం, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి ప్రశంస పత్రం అందజేశారు. రిటైర్డ్ చీఫ్ కార్యదర్శి మోహన్ కాందా నిర్వహించిన ఆన్‌లైన్ మీటింగ్‌కి స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ వీవీఎస్ లక్ష్మణ్ ముఖ్యవక్తగా సందేశాన్ని ఇచ్చినట్లు పేర్కొన్నట్లు తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం మద్దికుంట లక్ష్మణ్, జిల్లా విద్యాధికారి రమేశ్, తల్లిదండ్రులు అభినందించారు.

బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పరిమితులకు లోబడి మార్కెట్ రుణాలు తీసుకుందని, ప్రణాళిక, ప్రణాళికేతర ఖర్చులకు సరిపడేలా సర్దుబాటు విధానం అనుసరించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. లింగంపల్లి గ్రామంలో గురువారం మీడియాతో మాట్లాడారు. గతంతో పోలిస్తే అప్పులు తగ్గు ముఖంపట్టడం రాష్ట్రానికి శుభసూచకమన్నారు. గడిచిన పదినెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ.49,618 కోట్ల రుణాలు తీసుకుందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం 56,440కోట్లు వడ్డీలు, కిస్తీలు రూపంలో చెల్లించిందన్నారు. పది సంవత్సరాలు విధ్వంసమైన ఆర్థిక పరిస్థితిని చక్క బెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.7 లక్షలకోట్ల అప్పులు చేసిందని, వాటికి ప్రతీనెలా చెల్లించాల్సిన వడ్డీలు, కిస్తీలు గుదిబండగా మారాయని అన్నారు. అడ్డగోలుగా అప్పులు చేయకుండా నియంత్రణ పాటిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అప్పులను నియంత్రించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



వర్షం నీటిలో విద్యార్థులు

గంభీరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెం కాలనీలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణం గురువారం చెరువును తలపించే విధంగా దర్శనమిచ్చింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బడి ఆవరణ నీటితో నిండిపోయింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు నీటి నిల్వతో అవస్థలు పడ్డారు. వర్షం కురిసిన ప్రతీసారి పాఠశాల ఆవరణ నీటితో నిండిపోతోందని కాలనీ వాసులు తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇల్లంతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంటలో శుక్రవారం మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పర్యటించనున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి ప్రకటన తెలిపారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వీర్నపల్లి వ్యవసాయ అధికారిగా జయ

వీర్నపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల వ్యవసాయ అధికారిగా కొత్తపల్లి జయ గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన మండలం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జిలు బాధ్యతలు నిర్వహిస్తుండగా మొదటిసారిగా పూర్తిస్థాయి అధికారిని నియమించారు. దీంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సెంటర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

వీర్నపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ సెంటర్ల రిపోర్టులు, పోషణ్ ట్రాకర్, అనుబంధ పోషకాహార వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఐసీడీఎస్ సిరిసిల్ల ప్రాజెక్ట్ సీడీపీవో ఉమారాణి అన్నారు. వీర్నపల్లి మండల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్ నమోదుపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సూపర్‌వైజర్ సంతోషి, ఐటీ కోఆర్డినేటర్ ప్రవీణ్ కుమార్, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వసూలు చేయొద్దు

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ వసూలు చేయవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ మొగిలి హెచ్చరించారు. గురువారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మైక్రో ఫైనాన్స్‌మేనేజర్లతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు ఇచ్చి తిరిగి చెల్లించేటప్పుడు వేధింపులకు గురి చేయవద్దన్నారు. కొంత గడువు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై రాంమోహన్ తదితరులు ఉన్నారు.

దీపావళి కానుకగా డీఏ ఇవ్వాలి

వేములవాడ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఉద్యోగులకు దీపావళి కానుకగానైనా డీఏ ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాడారం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి హరేందర్ రెడ్డి గురువారం ప్రకటనలో కోరారు. కస్తూర్బా ఉపాధ్యాయులకు టైం స్కేల్ ఇవ్వాలని, 317 జీవో బాధితులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని కోరారు.

వైభవం.. మహా రథోత్సవం

- విశేష అలంకరణలతో దర్శనమిచ్చిన లక్ష్మీవేంకటేశ్వరుడు
- కన్నుల పండువగా కదిలిన మహారథం
- దర్శించుకున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్
- తరలివచ్చిన భక్తజనం
- భారీ బందోబస్తు



రథోత్సవంలో భారీగా వచ్చిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

భక్తిభావం ఉప్పొంగింది. నలుదిక్కులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. అశేషంగా తరలివచ్చిన భక్తజన సందోహం మధ్య మహారథంపై నుంచి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా కేంద్రంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన మహారథోత్సవం వైభంగా సాగింది. ఉదయం 4 గంటలకు హోమం నిర్వహించి స్వామివారిని రథంపై ఉంచారు. 6 గంటల నుంచి రథం పైనుంచి దర్శనం ఇచ్చారు. సాయంత్రం 4.50 గంటలకు ప్రారంభమైన మహారథోత్సవం సుమారు 5.45 గంటల వరకు సిరిసిల్ల తిరువీధుల్లో కన్నుల పండువగా సాగింది. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అదిశ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్వామి వారిని దర్శించుకున్నారు. మహారథంపై వేంకటేశ్వర దేవస్థానం చుట్టూ ఉన్న వీధుల్లో భక్తులకు శ్రీవారు విశేష అలంకరణలతో కనిపించారు. తెలంగాణ జిల్లాల్లోనే అతిపెద్దదైన 30అడుగుల ఎత్తుతో 160 సంవత్సరాల చరిత్ర ఉన్న రథయాత్రను చూడడానికి సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో భక్తులు వచ్చారు. మహారథంపై స్వామివారిని వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూపరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అకునూరి బాలరాజు, దేవస్థానం మాజీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి నాగరాజు, ఈవో మారుతీరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

లోక కళ్యాణం జరగాలి

- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోక కల్యాణం జరగాలని, సంక్షేమ ఫలాలు జిల్లా ప్రజలందరికీ అందాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రథోత్సవంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. 400 ఏళ్లుగా బ్రహ్మోత్సవాలను సిరిసిల్లలో వైభవోపేతంగా నిర్వహిస్తున్నారన్నారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు క్రీడల వైపు ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బాలబాలికలకు క్రీడా పోటీలను ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్సహించడం కోసమే ప్రభుత్వం ఎస్‌జీఎఫ్ క్రీడలను ఏటా నిర్వహిస్తోందన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్ - 14 వాలీబాల్ బాలికల విభాగంలో ఎల్లారెడ్డిపేట, అండర్ - 17 వాలీబాల్ బాలికల విభాగంలో ఎల్లారెడ్డిపేట, అండర్ - 14 వాలీబాల్ బాలుర విభాగంలో ముస్తాబాద్, అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఎల్లారెడ్డిపేట జట్లు గెలుపొందాయి. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్ర శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలలో పలుచోట్ల రోడ్లు బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 15 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో రోడ్డు నిర్మాణానికి 1 కోటి 65 లక్షల రూపాయలు, కొలనూరు నుంచి రామన్నపేట గ్రామంలో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి 1 కోటి 90 లక్షలు, సుద్దాల క్రాస్ రోడ్డు నుంచి మంగళపల్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి 1 కోటి 30 లక్షలు, మల్కాపేటలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రామాలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింద న్నారు. మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామం నుంచి అయోధ్య వరకు రూ.2 కోట్లు, కొండాపూర్ గ్రామంలో సీతారామస్వామి ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.83 లక్షలు, కథలాపూర్ మండలం దూలూరు గ్రామం నుంచి తక్కలపల్లి గ్రామంలోని మహాలక్ష్మి దేవాలయం మధ్యలో లో లెవెల్ వంతెన నిర్మాణానికి 85 లక్షల రూపాయలు, కథలాపూర్ మండల కేంద్రంలో కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారి నుంచి మోడల్ స్కూల్ వరకు రోడ్డు నిర్మాణానికి 1 కోటి 30 లక్షల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. చందుర్తి మండలం సనుగుల నుంచి (గంగిరెడ్డుల కాలనీ) మాకుల ఎల్లమ్మ వరకు 1 కోటి రూపాయలు, మూడపల్లి గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి హైస్కూల్ వరకు స్లాబ్, కల్వర్టు నిర్మాణానికి 80 లక్షల రూపాయలు, వేములవాడ మండలం మారుపాక గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి రాజనగర్ వరకు రూ.35 లక్షలు, రుద్రంగి మండల కేంద్రంలోని రామకృష్ణపూర్ వద్ద కల్వర్టు నిర్మాణానికి 62 లక్షల రూపాయలు, అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమాన్ టెంపుల్ మీదుగా ఇందిరా చౌక్ వరకు రోడ్డు నిర్మాణానికి 1 కోటి 50 లక్షల రూపాయల మంజూరయ్యాయని వివరించారు. నిధుల కేటాయింపుపై సీఎం రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక ధన్య వాదాలు తెలి పారు.

వేములవాడ నియోజకవర్గం పరిధిలో రోడ్లు బ్రిడ్జిల నిర్మాణానికి 15 కోట్ల రూపాయల నిధుల మంజూరుకు కృషి చేసిన వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల మంజూరుపై హర్షం

చందుర్తి: చందుర్తి మండలంలోని సనుగుల, మూడపల్లి, గ్రామాల్లో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, పంచాయ తీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ధన్య వాదాలు తెలిపారు. చందుర్తి మండల పరిధిలో సనుగులలో గంగిరెడ్డుల కాలనీ నుంచి మాకుల ఎల్లమ్మ వరకు రూపాయలు 1 కోటి మూడపల్లి గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి హైస్కూల్ వరకు స్లాబ్ కల్వర్టు నిర్మాణానికి రూపాయలు రూ.80 లక్షల నిధులు మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గంభీరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం రథంపై నుంచి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో శివకేశవుల రథోత్సావాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.ఆలయ అర్చకులు హరీశ్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ ఎలుసాని దేవయ్య ఆధ్వర్యంలో వారం రోజులుగా బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, రాజేశం, బాలయ్య, సంతోష్‌రావు, రమేశ్‌రెడ్డి, బండారి సత్తయ్య, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేట వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం గరుడసేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యం హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామివారి రథోత్సవం చేపట్టనున్నారు.

వర్షంతో అన్నదాత ఆగమాగం



కొట్టుకుపోయిన వడ్లను ఎత్తుతున్న రైతులు

ఎలారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ఆరబెట్టిన ధాన్యం వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. ధాన్యం కుప్పగా చేసేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడ్డారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆలస్యంతో వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 300 క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయిందన్నారు. 100 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయిందని తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని కోరారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు చీకోడ్, మద్దికుంట, మోయినికుంట, చిప్పలపెల్లి, నామాపూర్, ఆవునూర్, గూడెం తదితర గ్రామాల్లో గురువారం వేకువఝామున కురిసిన వర్షంతో రైతన్నలు ఆగమాయ్యారు. ఉరుములు మెరుపులతో కూడిన అకాల భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం వర్షంతో కొట్టుకుపోయింది. రైతన్నలు దిగాలుతో కొట్టుకుపోయిన ధాన్యాన్ని తీసుకు వచ్చే ప్రయత్నం చేసినా మట్టిలో కలిసి పోయి నష్టపోయారు. తడిసిన ధాన్యంతోపాటు, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. చందుర్తి మండలంలో వరి కోతలు ప్రారంభం కాగా, మరికొన్ని చోట్ల ధాన్యాన్ని కేంద్రాలు, కల్లాలు, రోడ్ల వెంట రాసులుగా పోయడంతో వర్షార్పణమైంది. కల్లాల దగ్గర రైతులు ఆరబోసి కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. ధాన్యం రైతులు ఆగమవుతుండగా, పత్తి చేనులలో పత్తి వర్షంతో తడిసి ముద్దయ్యిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు కోరుతున్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో పిడుగుపాటుతో గేదె మృతి చెందింది. మండలంలోని అంకుసాపూర్‌లో మిడిదొడ్డి రవి అనే రైతుకు చెందిన గేదె గురువారం ఉదయం పిడుగుపాటుతో మృతి చెందింది. రైతు రూ.లక్ష నష్టం వాటిల్లింది.

రైతుల్లో ఆందోళన

ఇల్లంతకుంట: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు పంటచేతికి అందివచ్చే దశలో వర్షాలు పడుతుండడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. కోతకు వచ్చిన వరిచేన్లు నేలకు ఒరుగుతున్నాయని, చివరి దశలో ఉన్న పత్తికి నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెంకటాపూర్‌లో కొట్టుకుపోయిన ధాన్యం

కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివారలు,స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని, ప్రజా ఫిర్యాదుల్లో జాప్యం చేయకూడాదని, బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని అన్నారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండాలని, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందించాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను ప్రతి రోజు తనిఖీ చేయాలని, స్టేషన్ పరిధిలో సీసీటీవీల ఏర్పాటుపై దృష్టి సారించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృషి చేయాలన్నారు. సిబ్బంది, అధికారులు సక్రమంగా విధులు నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఏఎస్సై బాపు ఉన్నారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుకు రైతు మృతి


నర్సింహారెడ్డి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని రైతు కామిడి నర్సింహారెడ్డి (50) అనే రైతు పిడుగుపాటుకు గురువారం మృతి చెందాడు. బండలింగంపల్లికి చెందిన నర్సింహారెడ్డి పొలం వద్ద పాడి గేదెలను పెంచుతున్నాడు. గురువారం వేకువజామున పొలం వద్దకు వెళ్లి పాడి గేదెల పాలు పితికాడు. కాళ్లు, చేతులు కడుకుంటున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా పిడుగు పడడంతో అక్కడికక్కడే చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నర్సింహారెడ్డికి భార్య చంద్రకళ, కొడుకు అజయ్ ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సప్తగిరికాలనీలో నివాసముండే సొన్నాయిల రమేష్(60) అనే వ్యక్తి బుధవారం రాత్రి మున్సిపల్ జంక్షన్ సమీపంలోని జిమ్ వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. సన్నటి వైరుతో ఉరి వేసుకోవడంతో అది తెగి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లేవారు చూసి 108కు ఫోన్‌చేయగా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు. రమేష్ బస్టాండ్ వద్ద సెలూన్ నడుపుకుంటూ జీవించేవాడు. కొంత కాలంగా రమేష్ మద్యానికి బానిసై మద్యం మత్తులో ఈనెల 16న ఉదయం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లాడు. రాత్రివరకు వెతికినా ఆచూకీ కనబడలేదు. గురువారం చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం పక్కన మానేరు కరకట్ట వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మెడలో పసుపు రంగు దారం, కుడిచెయికి రాగి కడెం ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్(27) అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజశేఖర్ చిన్నబోనాల బైపాస్ రహదారిపై ఈనెల 13న అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రహదారిపై ఆరబెటిన వడ్లపై జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌కు నాలుగు రోజులుగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు, పరిస్థితి విషమించి గురువారం చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన కరీంనగర్ సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఆకుబత్తిని శ్రీకాంత్ (38)ను గురువారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ప్రస్తుతం సిరిసిల్లలో ఉంటున్న శ్రీకాంత్ గురువారం ఏటీఎం గదిలో సీసీ కెమెరాలను సీలింగును సుత్తితో పగులగొట్టి దొంగతనానికి యత్నించాడని తెలిపారు. ఐదు గంటల వ్యవధిలోనే సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా పట్టుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

దొంగిలించిన ట్రాక్టర్ పట్టివేత

- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ


జూలపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ గజ్జి కృష్ణ

జూలపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపేట గ్రామానికి చెందిన ఏముండ్ల అనిల్ అనే రైతు ట్రాక్టర్‌ను ఐదు నెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు గురువారం ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామశివారులో పట్టుకున్నారు. జూలపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలను వెల్లడించారు. చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన జాతరగొండ అశోక్, జాతరగొండ శేఖర్ అనే వ్యక్తులు ట్రాక్టర్‌ను దొంగిలించి కొంతకాలం పాటు బయటకు తీయకుండా దాచి ఉంచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈక్రమంలో ఇంతకాలం దుండగులు దొంగిలించిన ట్రాక్టర్‌ను తమ పొలం వద్దనే దాచిపెట్టి గురువారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామం నుంచి గర్రెపల్లికి తరలిస్తుండగా అదే సమయంలో వాహనాలు తనిఖీ చేస్తున్న జూలపల్లి పోలీసులు ట్రాక్టర్‌ను గుర్తించారు. దుండగులు ట్రాక్టర్‌ను వదిలి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీసా పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్టు

బోయినపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌లో ఉపాధి అవకాశం కల్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వేములవాడ రూరల్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపారు. వివరాల ప్రకారం బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి చెందిన ముదాం వెంకటేష్ అనే వ్యక్తిని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం చెందిన దండుగుల కళ్యాణ్ వర్క్ వీసాపై గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.75 వేలుతీసుకున్నాడు. అయితే వెంకటేష్‌ను పంపని వీసాపై కాకుండా టూరిస్ట్ వీసాపై గల్ఫ్‌కు పంపించాడు. వెంకటేష్ ఇంటికి తిరిగి వచ్చి మోసం చేసిన కల్యాణ్‌పై ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దండుగుల కల్యాణ్‌ని బుధవారం అరెస్టుకు పంపినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడికి పాల్పడిన ఇద్దరికి ఏడాది జైలు

సుల్తానాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్రలతో దాడి చేసి గాయపరిచిన ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఐదు వందల రూపాయల జరిమానా విధిస్తూ సుల్తానాబాద్ జూనియర్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ గురువారం తీర్పు చెప్పారు. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రీనగర్‌కు చెందిన కాంపల్లి శ్రీహిత కరీంనగర్‌లో నివాసం ఉంటూ దీపావళి పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఇంటి పక్కనున్న కల్వల లక్ష్మయ్య, కల్వల వినీష్ అనే వ్యక్తులు 7 నవంబర్ 2018న రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో టపాసులు శ్రీ హిత ఇంటిలో వేయగా కుటుంబ సభ్యులు ఇదేంటని అడిగారు. దీంతో ఆగ్రహించిన నిందితులు కర్రలతో శ్రీహిత కుటుంబ సభ్యులపై దాడి చేయగా తలలకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు కానిస్టేబుల్ దేవరాజ్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌ప్రసాద్‌రావు, ఎస్ఐ శ్రావణ్‌కుమార్‌లు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలో జడ్జి నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు ఐదు వందల జరిమానా విధించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లందకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు. గురువారం ఉదయం జమ్మికుంట మండలంలోని విలాసాగర్ నుంచి టేకుర్తి మీదుగా సన్ని, అశోక్, రాజ్‌కుమార్, రమేశ్, అంజి, రమేశ్ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

ఆదర్శం

తాము మరణించినా..

మరొకరికి జీవం పోస్తూ..

అవయవ దానానికి ముందుకు వస్తున్న కుటుంబాలు

- ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై పెరిగిన అవగాహన
- ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు
- అవయవ దానానికి 60వేల మంది అంగీకారం...

కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : "అమ్మ జన్మనిస్తే అవయవదానం పునర్జన్మనిస్తుంది.. మరణించినా కళ్లు మాత్రం ఈ లోకాన్ని చూస్తూనే ఉంటాయి.. మూత్రపిండాలు రక్తాన్ని శుద్ధి చేస్తూనే ఉంటాయి... శ్వాస ఆగిపోయినా గుండె మాత్రం కొట్టుకుంటూనే ఉంటుంది.. ఆయువు పోయినా.. అవయదానంతో ఊపిరిపోద్దాం.. అవయవాలను ఈ లోకంలో జీవించనిద్దాం... రండి అవయదానం చేద్దాం... మరణించినా మరమరొకరి దేహంలో జీవించే ఉందాం.." అంటూ గోదావరిఖనిలో 17ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న 'సదాశయ ఫౌండేషన్' సంస్థ ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తోంది... వేలాది మంది అవయవదాన బాట పట్టిస్తున్నది.. కుటుంబ సభ్యులు అవయవాలే కాకుండా దేహదానాలకు కూడా ముందుకు వస్తున్నారు...


మృతదేహం వద్ద సెల్యూట్ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

● ఉమ్మడి జిల్లాలో 'సదాయశ' కార్యక్రమాలు...

సదాశయ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు అవయవదానంపై చేస్తున్న కృషికి.. కరీంనగర్ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు అవయవదానంపై స్పందిస్తున్నారు. ఇందులో మహిళలు, యువతనే ఎక్కువగా ఉంటుంది. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మృత్యువుకు చేరువలో ఉన్న వ్యక్తి అవయవాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వస్తున్నారు. పార్థివదేహం కాలిబూడిదై మట్టిలో కలిసిపోకుండా ఉండేందుకు, వైద్య విద్యార్థుల పరిశోధన కోసం ఉపయోపడేలా మృతదేహాన్ని కూడా అప్పగించి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేత్రదానం చేసి అంధులకు వెలుగులు ప్రసాదిస్తున్నారు.

సదాశయ ఫౌండేషన్ ద్వారా..

నేత్రదానం చేసిన వారు	1196
అవయవదానం చేసిన వారు	88
మెడికల్ కాలేజీలకు దేహదానం చేసిన వారు	125
అవయవదానంపై అవగాహన సదస్సులు	1315
అవయవదానం చేస్తామని అంగీకారం తెలిపిన వారు	60 వేలు


దేహదానానికి కలెక్టర్‌కు అంగీకార పత్రం అందజేస్తున్న జర్నలిస్టు వాసు(ఫైల్)


తమ్ముడి కళ్లను ఐ బ్యాంకుకు దానం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్(ఫైల్)

● అవయవాలను ఇలా సేకరిస్తారు..

కుటుంబ సభ్యుల అంగీకారంతో బ్రెయిన్డెడ్ అయిన పేషెంట్ నుంచి అవయవాలను తీసిన తర్వాత, వాటి నాణ్యతను బట్టి నిబంధనల ప్రకారం ఆయా ఆసుపత్రులకు జాగ్రత్తగా తరలిస్తారు. కొన్ని సందర్భాల్లో గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటు చేసి గుండెను రోడ్డు మార్గంలో తరలిస్తారు.

● అవయవాల కోసం...

అవయవాలు కావాల్సిన వారు ముందుగా జీవన్‌దాన్ కేంద్రంలో పేరు, పేషెంట్ బ్లడ్ గ్రూప్, ఏ అవయవమో నమోదు చేయించుకోవాలి. ఆరోగ్యశ్రీ కార్డు అర్హులకు ఉచితంగా, మిగితా వారికి కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మరణానంతరం అవయవదానం చేయాలని కోరుకునేవారు, జీవన్‌దాన్ సంస్థతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అవయవదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సంస్థల దగ్గర పేర్లను నమోదు చేయించుకోవచ్చు.

బతికున్న వారు దానం చేసే అవయవాలు..

- ఒక కిడ్నీ
- 1/4 వంతు కాలేయం
- ఎముక మజ్జ కణజాలం

మనిషి మరణానంతరం దానం చేసేవి...

శరీరంలోని 200 అవయవాలు, కణజాలం దానం చేయవచ్చు. ముఖ్యమైన కండ్లు, గుండె, గుండె కవాటాలు, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, క్లోమం, పెద్ద పేగు, చిన్న పేగు, రక్తనాళాలు, చెవిలోని కర్ణభేరి, ఎముకలు, మూలుగను తదితర వాటిని మృతుల నుంచి తీసుకుంటారు. ఇలా ఒక వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ఏడు నుంచి తొమ్మిది మందికి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉందని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న సంస్థలు

- సదాశయ ఫౌండేషన్
- లయన్స్ క్లబ్
- తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం.

అవయవ దాతలు, అవగాహన కల్పిస్తున్న సంస్థలను ప్రభుత్వం గౌరవించాలి..

- టీ శ్రవణ్ కుమార్, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు



నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పిస్తున్న సంస్థలు, అవయవ దాతలను ప్రభుత్వం, జీవం దాన్ సంస్థ గౌరవించాలి. మరణాంతరం నేత్రాలు, అవయవాలు వృథా పోనీయకుండా ఫ్రాన్స్, ఆస్ట్రియా, స్పెయిన్, శ్రీలంక తరహాలో మన దగ్గర ప్రభుత్వ లాంఛనాలతో అవయవదాతకు అంత్యక్రియలు నిర్వహించడం, కుటుంబానికి ప్రశంసాపత్రం, రూ.10వేలు ఆర్థికసాయం ఇచ్చేలా ఏపీ రాష్ట్రం స్ఫూర్తిదాయకమైన నిర్ణయం తీసుకుంది. అవయవదానంలో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం లాలపల్లెకు చెందిన గుర్రం మల్లారెడ్డి(41) అనే వ్యక్తి దుర్మరణం చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మల్లారెడ్డి కరీంనగర్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని రాత్రి కరీంనగర్ నుంచి లాలపల్లెకు బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును గర్రెపల్లి వద్ద స్థానిక యువకులు పట్టుకున్నారు.

ఆస్తి కోసం భార్య, అల్లుడి ఘాతుకం

- హత్య చేసి.. సహజ మరణంగా చిత్రీకరణ
- నిందితుల అరెస్టు


కోల్‌సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఐబీ కాలనీలో సెప్టెంబర్ 16న మృతి చెందిన సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్(60) సహజ మరణం కాదని, హత్యగా పోలీసులు తేల్చారు. ఆస్తి కోసం కట్టుకున్న భార్య దస్లి, చిన్న కూతురు సునీత భర్త రొంటాల నరేష్‌లు ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు తేల్చారు. మొదట అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నివేదికలో మెడ ఎముకలు విరగడం, ఛాతిపై, కాలుపై గాయాలతో మృతిచెందినట్టు నివేదికలో పేర్కొన్నారు. దీంతో అప్పటికే మృతుని కుమారుడు వెంకటేష్ ఫిర్యాదుతో భార్య దస్లి, నరేష్‌ల పాత్రపై విచారణ జరుపుతున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం ఒప్పుకున్నారు. హరిసింగ్‌కు భార్య, ఒక కుమారుడు వెంకటేష్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. చిన్న కూతురు సునీత గోదావరిఖనికి చెందిన నరేష్‌ను ప్రేమ వివాహం చేసుకున్నది. దీంతో తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నదని హరిసింగ్ కూతురు, అల్లుడిని ఇంటికి రానివ్వలేదు. సింగరేణి కార్మికుడైన అల్లుడు నరేష్ మద్యానికి బానిసై డ్యూటీలు చేసేవాడు కాదు. హరిసింగ్ సెప్టెంబర్‌లో రిటైర్డ్ అవుతుండడంతో పదవీ విరమణ తరువాత డబ్బులు వస్తాయని, అవి తమకు ఇవ్వకుండా కొడుకు, పెద్ద కూతురుకే ఇస్తారని భావించారు. సునీత తన తల్లి దస్లితో ఇదే విషయమై మూడు నెలలుగా చెబుతోంది.. కూతురుకు డబ్బులు ఇవ్వాలని దస్లి తన భర్త హరిసింగ్‌కు చెప్పగా ఆయన తిరస్కరించారు. దస్లి పేర ఖమ్మంలో రూ.70లక్షల విలువైన ఇంటి స్థలం ఉంది. ఇది కాకుండా హరిసింగ్, దస్లి జాయింట్ అకౌంట్‌లో రూ.4లక్షల నగదు ఉన్నాయి. హరిసింగ్‌ను కడతేర్చితే డబ్బులు వస్తాయని, ఇంటి స్థలం కూడా అమ్ముకోవచ్చునని భావించారు. సెప్టెంబర్ 16న గణపతి నిమజ్జనం కావడం, ఆరోగ్యం బాగా లేక హరిసింగ్ ఇంట్లో పడుకోవడంతో దస్లి తన కూతురు సునీతకు ఫోన్ చేసి నరేష్‌ను పంపమని పేర్కొన్నది. పథకం ప్రకారం ఇంటికి వచ్చిన నరేష్ నిద్రలో ఉన్న హరిసింగ్ మెడకు వైరు బిగించాడు. భార్య దస్లి దిండుతో హరిసింగ్ ముఖంపై శ్వాస ఆడకుండా అదిమింది. దీంతో అతడు మృతి చెందాడు. కొద్ది సేపటికి బయటకు వచ్చి తన భర్త కదలడం లేదని, అనారోగ్యం బారిన పడ్డాడంటూ స్థానికులను నమ్మించింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై హరిసింగ్ కుమారుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మరణంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దానిని హత్య కేసుగా మార్చినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. నిందితులు బానోతు దస్లి, రొంటాల నరేష్‌లను గురువారం అరెస్టు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

రాయపట్నం వద్ద ఆటో బోల్తా

● బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ధర్మపురి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని రాయపట్నం రహదారి వద్ద ఒక ఆటో బోల్తాపడి బైక్ ఢీకొట్టడంతో గురువారం మేడిశెట్టి వెంకటయ్య, షైదం అశోక్ అనే ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వెంకటయ్య, అశోక్ తన ద్విచక్ర వాహనంపై మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట నుంచి ధర్మపురి వైపు బయలు దేరారు. ఆ సమయంలో ఆవు దూసు కు రావడంతో ధర్మపురి నుంచి రాయపట్నం వైపు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడి గాయపడ్డారు. ఆటో డ్రైవర్ కూడా గాయపడినట్లు తెలుస్తోంది.


బోల్తా పడిన ఆటో

ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు

- రామగుండంలో మరో 176 మెగావాట్ల సోలార్ విద్యుత్ విస్తరణ
- రూ.800 కోట్లతో కొత్త ప్రాజెక్టు
- ఇప్పటికే 100 ఫ్లోటింగ్, 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ విద్యుత్


దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు


10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్ ప్రాజెక్టు

జ్యోతినగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రామగుండంలోని ఎన్టీపీసీలో మరిన్ని సౌర వెలుగులు రానున్నాయి. 4200 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ(సాంప్రదాయేతర)పై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఇప్పటికే 10 మెగావాట్ల సర్ఫేస్ సోలార్, 100 మెగావాట్ల ఫ్లోటింగ్(నీటిలో తేలియాడే) సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను ఎన్టీపీసీ నెలకొల్పింది. ఈక్రమంలో సౌర విద్యుత్ విస్తరణకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, పక్కనే ఉన్న స్థలంలో మరో 120 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు నిర్మించనున్నది. ఇప్పటికే 176 మెగావాట్ల ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయి లాంఛనంగా నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఇప్పటికే 100 మెగావాట్ల దేశంలోనే అతిపెద్ద ఫ్లోటింగ్ సౌర ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎన్టీపీసీ మరో 56 మెగావాట్ల ఫ్లోటింగ్ సౌర విద్యుత్ యూనిట్‌తో మరో రికార్డు సృష్టించనున్నది.

● త్వరలో ప్రధాని మోదీతో శంకుస్థాపన

సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 176 మెగావాట్ల సౌర(ఫ్లోటింగ్, సర్ఫేస్)విద్యుత్ ప్రాజెక్టుకు త్వరలో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దేశ వ్యాప్తంగా వివిధ ఎన్టీపీసీ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ప్రధాని వర్చువల్‌గా ఇక్కడి సోలార్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని సమాచారం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎల్అండ్‌టీ సంస్థకు నిర్మాణ కాంట్రాక్టు లభించగా, ప్రాజెక్టుకు అవసరమైన సోలార్ ప్యానళ్ల ఇతర ఉపకరణాలు ఇక్కడికి చేరుకున్నాయి.

తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

జగిత్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతం నుంచి వరద ఎక్కువగా వస్తుండడంతో గురువారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లను అధికారులు తెరిచారు. ప్రాజెక్టుకు చెందిన మూడు గేట్లను తెరిచి 9,372 క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 18,826 క్యూసెక్కుల నీరు వస్తోంది.

బతికెపల్లిలో ఒకరి ఆత్మహత్య

పెగడపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన పోచంపల్లి మల్లయ్య (56) అను వ్యక్తి అనారోగ్య సమస్యలతో కత్తితో గొంతులో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్య రెండేళ్లుగా లివర్, గుండె, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఆరు నెలల క్రితం లివర్ చెడిపోయిందని వైద్యులు తెలిపారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్థాపం చెంది ఇంట్లోనే ఆత్మహత్య చేసున్నట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్.రవికిరణ్ తెలిపారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఆడ శిశువు మృతదేహం లభ్యం

హుజూరాబాద్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాత్రూంలో ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని మహిళ ఆడ శిశువును జన్మించిందనే ఉద్దేశంతో బాత్రూంలో పడేసి వెళ్లినట్లు తెలుస్తోంది. 24గంటలు వైద్యులు, జనం తిరుగుతూ ఉండే ఆస్పత్రిలో శిశువు లభ్యం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎమర్జెన్సీ రూమ్‌లోని బాత్రూంను ఆస్పత్రి సిబ్బంది శుభ్రం చేయడానికి వెళ్లగా మృతి చెందిన ఆడ శిశువు కనబడింది. దీంతో వైద్యులకు విషయాన్ని తెలపడంతో, పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా వేరే ఆస్పత్రిలో అబార్షన్ చేయించుకొని ఈ ఆస్పత్రిలో పడేసినట్లు ఆనవాళ్లు ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. ఏది ఏమైనా పోలీసులు లోతుగా విచారణ చేపడితే అసలు విషయాలు బయటకి వచ్చే అవకాశం ఉంది.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం

-ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య

సుభాష్‌నగర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని ఎస్సీ వర్గీకణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య, కో చైర్మన్ నల్లల కనకరాజు అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి ఆర్టికల్ 341కు, పార్లమెంట్‌కు వ్యతిరేకంగా ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2011 లెక్కలను వ్యతిరేకిస్తు న్నామన్నారు. 2014 నుంచి 2024 వరకు లెక్కలు తీస్తే ఎవరు అభివృద్ధి చెందారో, ఎవరు చెందలేదో తెలుస్తుందన్నారు. అభివృద్ధి చెందని వారికోసం ప్రభుత్వం ప్రత్యేకమైన ప్యాకేజీలు, బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఐదుగురు రిటైర్డ్ జడ్జిలతో జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మాలలను చైతన్యం చేస్తూ, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా నవంబరులో లక్షలాదిమందితో మాలల శక్తి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా మాలల చైతన్య బస్సు యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లపల్లి రవి, రాంచందర్, మేడి రాజవీరు, కొరివి వేణుగోపాల్, ఆర్ష మల్లేశం, కరణం కిషన్, గోపోజు రమేశ్, కేశవులు, ఎర్రమల్ల రాములు, దాసరి దశరథం, మేడి అంజయ్య, బత్తుల ప్రదీప్, గంటల బట్టి అనమల్ల, మేడి మహేశ్, సానాది వెంకటేష్, బైరం కుమార్, బిట్ల ప్రవీణ్, తీట్ల ఈశ్వరి, గంటల రేణుక, శీలం పుష్పలత, ఆశ విజయ, మేకల రజనీ, బండ అనిత, మేదిని లక్ష్మి, జంగ లక్ష్మి, మేకల రజని, ఆపర్ణ, ఉరుమడ్ల లక్ష్మన్, ఎడ్ల లక్ష్మి, మాది శ్రీహరి, మల్లెపల్లి సుమలత ఉన్నారు.

గరీబోళ్ల సూపర్ మార్కెట్

ఇంట్లో శుభకార్యం ఉంది.. శనివారం గంగాధర అంగడికి పోవాలి.. గొర్లు, మేకలు అగ్గువకే దొరుకుతయి.. రైతులే తెస్తరు కదా.. కూరగాయలు మంచిగుంటయి.. మసాలా దినుసులూ తీసుకోవచ్చు.. ఏమన్నా మరిచిపోయిన చిన్న వస్తువులూ దొరుకుతయి.. ఇవీ గంగాధర మండలంలో వినిపించే మాటలు.. ఇక్కడ శనివారం జరిగే అంగడికి ఐదు దశాబ్దాల చరిత్ర ఉంది. చుట్టుపక్కల గ్రామాల వారికి ఏ వస్తువులు కావాలన్నా గంగాధర అంగడికే వస్తారు. అందుబాటు ధరల్లో అన్ని వస్తువులు లభించడంతో బడుగు జీవులు ఎక్కువగా వస్తుంటారు. దీంతో ఇది గరీబోళ్ల సూపర్‌మార్కెట్‌గా పేరు పొందింది..



గంగాధర వారసంతలో మసాల దినుసుల షాపు

- గంగాధర అంగడిది ఐదు దశాబ్దాల చరిత్ర
- తాజా కూరగాయలు..
- భారీగా పశువుల అమ్మకాలు

గంగాధర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర వారసంతది 50 ఏళ్ల చరిత్ర. మండల కేంద్రంలోని బ్లాక్ వద్ద ప్రతి శనివారం అంగడి జరుగుతుంది. ప్రస్తుతం విస్తరించిన సాంకేతికతతో ఇంటివద్దకే అన్ని వస్తువులు వస్తున్న కాలంలోనూ ఈ అంగడికి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఇక్కడ తాజా కూరగాయలు, ఇంటికి అవసరమయ్యే వస్తువులు, మసాలా దినుసులు, పండ్లు, బట్టలు, చిరుధాన్యాలు, తినుబండారాలు, ప్లాస్టిక్ వస్తువులు ఇలా ఒక్కటేమిటి అన్నీ లభిస్తాయి. రైతులకు అవసరమైన వస్తువులు అందుబాటు ధరలో దొరుకుతాయి. ఈ సంత ద్వారా గ్రామ పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరుతోంది

● మేకలు, గొర్రెల కోసం ఇతర జిల్లాల నుంచి రాక

ఉమ్మడి జిల్లాలో మేకలు, పశువులకు గంగాదర అంగడిది పెట్టింది పేరు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు అన్ని వర్గాల వారికి మేకలు, గొర్రెలు అందుబాటులో ఉంటాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, వరంగల్‌తోపాటు మహరాష్ట్ర నుంచి ఇక్కడికి మేకలు, గొర్రెలు, పశువుల అమ్మకాలు, కొనుగోళ్ల కోసం వస్తుంటారు. పాడి పశువుల విక్రయం జోరుగా సాగుతుంది. పెళ్లిళ్లు, పండగల సమయంలో ఒక్కో వ్యాపారి సుమారుగా వంద మేకలను అమ్ముతారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ఐదు వందల మంది పశువుల వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

● రైతులే విక్రయదారులు

గతంలో ఊళ్లో ఇంటింటికి తిరిగి కూరగాయలు విక్రయించే వారు. ప్రస్తుతం గంగాధర వారసంతకు వచ్చేవారిని దృష్టిలో పెట్టుకుని రైతులే స్వయంగా తాజా కూరగాయలను విక్రయిస్తున్నారు. కూరగాయల వ్యాపారం రాత్రి ఏడు గంటల వరకు సాగుతుంది. ఉద్యోగులు, ప్రజలు, వ్యాపారులు ఎక్కువగా ఇక్కడి నుంచే వారానికి సరిపడా కూరగాయలు తీసుకెళుతుంటారు. అంగడిలో అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, మసాలా దినుసులు తక్కువ ధరలో దొరుకుతాయి.

● గ్రామ పంచాయతీకి రూ. 1.6 కోట్ల ఆదాయం

గంగాధర వారసంత 50 ఏళ్ల క్రితం కూరగాయలు, బట్టలు, చిన్న చిన్న వస్తువుల అమ్మకాలతో ప్రారంభమైంది. మెల్లిమెల్లిగా విస్తరించి జిల్లాలోనే రెండో పెద్ద సంతగా నిలిచింది. నాడు గ్రామ పంచాయతీకి ఏటా 150 రూపాయల ఆదాయం వచ్చేంది. ప్రస్తుతం అది 1.6 కోట్ల రూపాయలకు చేరింది. ఆదాయానికి తగినట్లు అంగడిలో సౌకర్యాలు కల్పించారు. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకునే వారికి రోడ్డు వెంట రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. పశువులకు ప్రత్యేకంగా అంగడి చుట్టు ప్రహరీ నిర్మించి వాహనాల నుంచి వాటిని దింపడానికి గద్దెలను ఏర్పాటు చేశారు.



సంతలో దుస్తుల కొనుగోలు చేస్తున్న మహిళ



విక్రయానికి వచ్చిన పశువులు



సంతలో కూరగాయల విక్రయం

సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుంది

అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



ఎన్నీల ముచ్చట్లలో పాల్గొన్న అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సాహిత్య సృజనతో సమాజంలో శాంతి పరిమళిస్తుందని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. గురువారం రాత్రి తన క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 138 ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్‌ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ప్రతీ పౌర్ణమి ఒక రచయిత ఇంట్లో కవులందరూ కలిసి సామూహికంగా కవిత గానం చేయడం సాహిత్య చరిత్రలో గొప్ప అధ్యాయమన్నారు. నేటి పౌర్ణమి నుంచి కవితలకు బదులుగా కథా పఠనం చేయాలని నిర్ణయించడం గొప్ప పరిణామమని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా అధ్యక్షుడు సి వి కుమార్, ప్రదాన కార్యదర్శి డి. శంకరయ్య, సీనియర్ కథా రచయితలు బివియన్ స్వామి, బుర్ర తిరుపతి, గాజోజు నాగభూషణం ఉన్నారు.

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సిద్ధం

ఏడు మిల్లులను నోటిఫై చేసిన అధికారులు



జమ్మికుంట జిన్నింగ్ మిల్లులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న అధికారులు.

జమ్మికుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తోంది. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ చేసేందుకు ఏడు మిల్లులను అధికారులు నోటిఫై చేశారు. వైభవ్, వజ్రకల్ప, లక్ష్మి, నరసింహా, సరిత, రాజశ్రీ, సీతరామ కాటన్ మిల్లులను ఎంపిక చేశారు. మిల్లర్లతో ఇంకా అగ్రిమెంట్‌చేసుకోలేదు. గురువారం వీటిలో సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాలేషన్ చేశారు. నోటిఫై చేసిన మిల్లుల్లో రైతులకు సీసీఐ నిభందనలపై అవగాహన కల్పిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ సీసీఐకి పత్తి విక్రయించే రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పుస్తకం, ఆధార్‌తో అనుసందానం ఉన్న బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌ల వెంట తీసుకురావాలని సూచించారు. ఎనిమిది నుంచి 12 శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు 7,521 నుంచి 7,220 రూపాయలు చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తిని ఆరబెట్టుకుని, నీళ్లు చల్లకుండా తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కొద్ది రోజుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయని, అప్పటి వరకు రైతులు అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు.

తలనీలాల టెండర్ రూ.1.80 కోట్లు




టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో తలానీలాల పోగు చేసుకునేందుకు అధికారులు నిర్వహించిన వేలంలో రూ.1.80కోట్లు హెచ్చు పాటగా నిలిచింది. తరచూ వాయిదా పడుతూ వస్తున్న టెండర్లలో కాస్త పెంచారు. ఇప్పటికే తొమ్మిది సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు పదో సారి గురువారం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో అయిదుగురు టెండర్ దారులు పాల్గొన్నారు. మార్కెట్‌లో ధరలు లేవనే షాకుతో టెండర్ పెంచకుండా వస్తున్న టెండర్ దారులు నేటి వేలంలో ఏడాది కాలపరిమితికి గాను కేవీఎస్ ఎంటర్‌ప్రైజెస్ రూ.కోటి 80లక్షల వెయ్యి హెచ్చు పాట పలికింది. దీంతో ఖరారు చేయడానికి గాను అనుమతి కోసం కమిషనర్‌కు నివేదించినట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఏడాది కాలపరిమితికి గాను గతంలో రూ.3కోట్లకు పైగా పలుకగా ఇరవై రోజుల క్రితం నిర్వహించిన వేలంలో రూ.1.76 హెచ్చు పాట వచ్చింది. అయితే దాన్ని రద్దు చేశారు. సుమారు రూ.2లక్షలకు పైగా ఖర్చుతో రూ.4లక్షలు పెరిగినట్లు అయింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, డిప్యుటి కమిషనర్ టి.వెంకటేష్, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్ ఆలయ సిబ్బంది ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

● నిల్వ తలనీలాలకు కిలోకి రూ.10,300

గత ఏడాది ఆగస్టు నుంచి జూలై వరకు దేవస్థానం ఆధ్వర్యంలో సేకరించి నిల్వ చేసిన తలనీలాల విక్రయానికి గాను ఈ టెండర్‌లో కిలోకి రూ.10,300పలికింది. ఇందులో 11 మంది పాల్గొనగా హైదరాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హేర్ ఎంటర్ ప్రైజెస్ కిలోకి రూ.10,300తో హెచ్చు పాటగ నిలిచింది. రెండు నెలల క్రితం నిర్వహించినప్పుడు కిలోకి రూ.8500 రాగ ఇప్పుడు రూ.1800 అదనంగా ఆదాయం సమకూరనుంది.

20న సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్, అక్టోబరు17: (ఆంధ్రజ్యోతి): సహకార భారతి 4వ రాష్ట్ర సమ్మేళనం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు సహకార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యామడుగు శంకరయ్య, జిల్లా అధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి తెలిపారు. గురవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో రాష్ట్ర సమ్మేళనం కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ చింతకుంటలో నిర్వహించే రాష్ట్ర సమ్మేళనానికి సహకార భారతి జాతీయ సంఘటన మంత్రి సంజయ్ పాచ్పోర్, జాతీయ మంత్రి చాందినీరాయ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి సుమారు వేయి మంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సర్వాజి తిరుపతి, ఉపాధ్యక్షుడు దొనపాటి సురేందర్‌రెడ్డి, కొత్తపల్లి కన్వీనర్ బండ కిషన్‌రెడ్డి, కో కన్వీనర్ చిటుకూరి శ్రీనివాస్, మన ఆదర్శ డైరెక్టర్ ఉమ్మెంతుల లక్ష్మారెడ్డి, చింతకుంట కన్వీనర్ దొనపాటి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వేధింపులు

ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

జగిత్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ బాలిక (13) ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు (13) కొద్ది రోజులుగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్‌లోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయన్నారు. బాధిత మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను అమలు చేస్తూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్నకు 'డిప్యూటేషన్ల' భారం

● సాధారణ బదిలీలకు ఉద్యోగుల దూరం ● సిబ్బంది కొరత నెపంతో కొనసాగింపు ● ఏళ్ల తరబడి విధులు.. పట్టించుకోని దేవాదాయ శాఖ

మల్యాల,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో డిప్యూటేషన్‌పై వచ్చిన ఉద్యోగ సిబ్బంది ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. దేవస్థానానికి భారం అయినప్పటికీ సిబ్బంది కొరత నెపంతో దేవాదాయ శాఖ మిన్నకుండిపోతోంది. ఇటీవల సాధారణ బదిలీలు జరుగగా అందులో అవకాశం లేకపోవడంతో డిప్యూటేషన్ ఉద్యోగులు తాము కోరుకున్న చోటకు వచ్చిన చోటే కదల కుండా ఉండాల్సి వచ్చింది. చిన్న ఆలయాల నుంచి డిప్యూటేషన్‌పై రావడం కాలపరిమితి ముగిసే సమయానికి అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతి నిధులతో పైరవీలు చేయించుకుంటూ ఏళ్ల తరబ డి కొండగట్టు అంజన్నను వీడడం లేదు. ఇలా 12 ఏళ్లుగా కొందరు ఇక్కడే కొనసాగుతున్నారంటే డిప్యుటేషన్ ఉద్యోగాలకు ఎంత ప్రాధాన్యత ఉందో తెలుస్తోంది.

● నిబంధనలు ఇవీ..

రాష్ట్ర వ్యాప్తంగా గల డిప్యూటీ కమిషనర్, రీజినల్ జోనల్ కమిషనర్ స్థాయి దేవస్థానాలలో పని చేసే ఉద్యోగుల విధివిధానాలను గత 2000 సంవత్సరంలో జీవో 888 ద్వారా ఖరారు చేశారు. దానికి 2019లో అన్ని రకాల బదిలీలు సమాన స్థాయి ఆలయాల్లోకి మాత్రమే చేపట్టాలని జీవో ఎంఎస్ 64 ద్వారా సవరణ చేశారు. నెల రోజుల క్రితం జరిగిన బదిలీలు అన్నింటిని దేవాదాయ శాఖ ఇలాగే చేపట్టింది. ఆర్‌జేసీ, డీసీ ఆలయాలను యానిట్‌గా తీసుకొని బదిలీల ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఇందులో డిప్యూటేషన్‌పై వచ్చిన వారికి అవకాశం లేకపోగా పెద్ద ఆలయాల్లో చిన్న దేవస్థానాల నుంచి వచ్చిన ఉద్యోగులకు మాత్రం స్థాన చలనం కాకపోగా వారి స్థానాలు పదిలంగా ఉన్నాయి. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు సమానస్థాయి ఆలయాలకు సంబంధించిన ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉండగా చిన్న ఆలయాల ఉద్యోగులు ఏళ్ల తరబడి తమ కాలపరిమితి పెంచుకునే ఆదేశాలు తీసుకువస్తూ విధులు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆరుగురు ఉద్యోగులు ప్రస్తుతం డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వీళ్లలో కొందరు తరచూ పొడగింపు ఆదేశాలతో ఏళ్లుగా కొనసా గుతున్నారు. ఇందులో కొందరి డిప్యూటేషన్ ఇటీవల ముగుస్తుండడంతో మళ్లీ పొండగింపు నకు దేవస్థానం అధికారులు కమిషనర్‌కు నివే దించినట్లు తెలిసింది. దేవస్థానానికి సమకూరే ఆదాయంలో 30శాతం దాటకుండా ఉద్యోగ జీతభత్యాలు చెల్లించాలనే నిబంధనలు, దేవస్థానం అదాయానికి నష్టం వాటిల్లుతున్నప్పటికీ పట్టించుకునే వారే లేరని పలువురు బహిరం గగానే ఆరోపిస్తున్నారు



కొరతతోనే కొనసాగింపు

ఎం. రామకృష్ణరావు, ఈవో

దేవస్థానం ఆదాయంలో 30శాతం కాస్త దాటినప్పటికీ ఉద్యోగుల కొరత దృష్ట్యా డిప్యుటేషన్ ఉద్యోగుల విధులు తప్పనిసరిగా వినియోగించుకోవాల్సి వస్తోంది. ఇక్కడ డిప్యుటేషన్లు గతంలో నుంచే కొనసాగుతున్నాయి. కాలపరిమితి ముగిసిన ఉద్యోగుల డిప్యూటేషన్ పొడగింపునకు కమిషనర్‌కు నివేదించాము.

ఆర్టీసీకి దసరా పండుగ

● కరీంనగర్ రీజియన్‌కు రూ. 31.50 కోట్ల ఆదాయం

భగత్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి కరీంనగర్ రీజియన్‌లో దసరా పండుగకు రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించి రీజియన్ వ్యాప్తంగా 31.50 కోట్ల ఆదాయం రాబట్టింది. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఈనెల మొదటి తేదీ నుంచే కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు బస్సులను ప్రణాళికాబద్ధంగా నడిపిం చడంలో ఆర్టీసీ అధికారులు సఫలమయ్యారు. ఈ నెల 1వ తేదీ నుంచి 16 తేదీ వరకు ఆర్టీసీ బస్సులను విజయవంతంగా నడిపిం చింది. దసరా ముందు రోజుల్లో జూబ్లీ నుంచి కరీంనగర్, దసరా తర్వాత తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి జూబ్లీ బస్‌స్టేషన్ల మధ్య అదనంగా బస్సులను నడిపించి రికార్డు స్థాయిలో ప్రయాణికులను చేరవేసింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 53.32 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిపించి, 95 శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్)తో మొత్తం 61,11,849 మంది ప్రయాణికులను గమ్య స్థానాలకు చేరవేసింది.

ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి

- కరీంనగర్ ఆర్ఎం సుచరిత



ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌కు ఆదాయ సముపార్జనలో సిబ్బంది కృషి ఎంతో ఉంది. రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల్లో ఆదాయ సముపార్జనలో శక్తివంచన లేకుండా సంస్థ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు ఎంతో కృషి చేశారు. ఆర్టీసీ సేవలు మరింత ముందుకు తీసుకువెళ్తాం.

● కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా డిపోల వారీగా వచ్చిన ఆదాయ వివరాలు..

డిపో	కి.మీ (లక్షల్లో)	ఆదాయం (లక్షల్లో)	ఓఆర్	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్మి ప్రయాణికులు
గోదావరిఖని	8.06	527.45	104	9,79,400	6,87,807
హుస్నాబాద్	2.63	143.42	96	4,00,808	2,77,121
హుజూరాబాద్	3.46	211.49	107	4,89,314	3,25,629
జగిత్యాల	7.18	421.74	92	8,08,209	5,70,138
కరీంనగర్-1	6.31	338.36	81	5,51,087	3,53,221
కరీంనగర్-2	7.91	423.19	86	6,65,215	4,22,017
కోరుట్ల	3.59	225.73	99	4,56,980	3,46,469
మంథని	3.19	183.91	92	3,04,307	1,98,840
మెట్‌పలి	3.24	214.21	102	4,72,399	3,60,976
సిరిసిల్ల	3.78	227,44	99	4,68,034	2,96,512
వేములవాడ	3.98	232,86	97	5,16,096	3,95,814
రీజియన్	53.32	3149.80	95	6111849	4234544

న్యూస్ బాక్స్

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం గాంధీనగర్ తుల్జా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి మేలుకొలుపు వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమితి ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నదానం కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజపూర్ణచందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, వార్డు నాయకులు శ్రీరాముల రవీందర్, సాప పురుషోత్తం, కోడం అమర్, వంగరి గోపి, గజభీంకార్ నారాయణ, అన్నల్‌దాస్ సాయిలు, బత్తుల శంకర్, తీగల రాజుగౌడ్, వలుస లక్ష్మణ్, వలుస చంద్రశేఖర్, వాసాల లక్ష్మీనారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

ఐదుగురు పోకిరీలపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న ఐదుగురు పోకిరీలపై కేసు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేసి వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అకౌంట్స్‌ని హ్యాక్‌చేసి అసభ్యకర వీడియోలు, ఫొటోలు పంపుతూ మహిళలు, విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే డయల్ 100కు లేదా షీటీమ్ 8712656425 నంబరులో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తంగళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం కస్బెకట్కూర్ గ్రామం చింతలపల్లిలో పోచమ్మ గుడి నిర్మాణానికి సెస్ చైర్మన్ చిక్కాల రామారావు రూ.50 వేలు విరాళాన్ని అందించారు. గురువారం చిక్కాల రామారావు స్థానిక నాయకులు చీమల ప్రశాంత్ యాదవ్, సామనపల్లి శేఖర్, మామిడ్ల మహేష్‌కు చెక్కు అందజేశారు.

'అలయ్ బలయ్'ని విజయవంతం చేయాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న అలయ్ బలయ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి మాజీ మంత్రి హరీ‌ష్‌రావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులను గుర్తించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తరగతి గదుల్లో ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులను గుర్తించాలని మండల విద్యాధికారి శ్రీనివా‌స్‌గౌడ్ సూచించారు. ఎమ్మార్సీ భవనంలో గురువారం ప్రాశస్త్ ఆప్‌పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాశస్త్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




నివాళులు అర్పించిన ఎస్పీ అఖిల్ మహాజన్, పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. వాల్మీకి జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహా గ్రంథాన్ని 24 వేల శ్లోకాలతో ఆది కావ్యంగా పూర్తి చేసిన గొప్ప వ్యక్తి మహర్షి వాల్మీకి అన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు మహా పురుషులవుతారు అనేదానికి వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బీసీ వెల్ఫేర్ అధికారి రాజమనోహర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాం రెడ్డి, సూపరింటెండెంట్లు కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి ఎస్పీ అఖిల్ మహాజన్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామాయణం గ్రంథాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసకొని మంచిపేరు తెచ్చుకోవాలన్నారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, కమిషనర్, అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది వాల్మీకి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రపంచానికి ఆదర్శప్రాయమైన రామాయణాన్ని వాల్మీకి మహర్షి అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫాసహత్ అలీ బేగ్, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, బొల్గం నాగరాజు, పాతూరి రాజిరెడ్డి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో గురువారం వాల్మీకీ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెటాలియన్‌లో వాల్మీకి మహర్ష చిత్రపటానికి బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సాంబశివరావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఉదయభాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో బోయ సంఘం ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు మాండ్ల బాలయ్య, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, కోశాధికారి పెంటయ్య, సంఘం నాయకులు లక్ష్మణ్, కిష్టయ్య, నర్సింలు, శ్రీనివాస్, నవీన్, రవి, నారాయణ, భాను, చంద్రం, లింగం, హన్మండ్లు, సుబాష్, రామవ్వ ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బోయ వాల్మీకి సంఘం గ్రామ అధ్యక్షుడు మోట్ల భాస్కర్, ఉపాధ్యక్షుడు మోట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి మేకల కిషన్, మేకల రాజు, మేకల శ్రీనివాస్, బోయ రవి, బోయ బాలకిషన్, మేకల తిరుపతి, మాజీ సర్పంచ్ మోట్ల మధు కాంగ్రెస్ నాయకులు ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అసరి బాలరాజు యాదవ్ తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో..

వేములవాడ: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బోయవాణిగా జీవితం గడిపిన వాల్మీకి మహర్షి రామాయణ మహా గ్రంథాన్ని శ్లోకాలతో ఆదికావ్యంగా పూర్తి చేసిన మహనీయుడు అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో కమిషనర్ సంపత్ రెడ్డి, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కార్యాలయ ఉద్యోగులు నాయకులు తదితరులు ఉన్నారు.



సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్



వేములవాడలో..

రాజన్న ఆలయ ఉద్యోగికి పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బొడుసు మహే‌ష్‌కు పదోన్నతి లభించినట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహే‌ష్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్ పర్యవేక్షకులు పూజిత, సీనియర్ అసిస్టెంట్‌లు పురాణం వంశీ, కూరగాయాల శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చందుర్తి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతీ ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదును చందుర్తి మండల శాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ సనుగుల పాఠశాలలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ పీఆర్టీయూ టీఎస్ అధికార అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి కొడగంటి తిరుపతి సనుగుల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, జువ్వాడి అనిల్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడెపు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

ఐదు విడతల డీఏను విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదు విడుతలుగా రావాల్సిన డీఏను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పీఆర్టీయూ టీఎస్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కామినేని నీలి శ్రీనివా‌స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివా‌స్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్, మెడికల్ బిల్లులు, సరెండర్‌లీవ్ బిల్లులతోపాటు పెండింగ్ బిల్లులను కూడా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య పనుల కోసం నిధులు విడుదలపై స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. పాఠశాల కమిటీ ఖాతాల్లో నిధులను జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర బాధ్యులు చిప్పయాదగిరి, వినోద్‌కుమార్, కూతూరి కర్నుకర్‌రెడ్డి, గుర్రం దేవదాస్, పోన్నాల బాల్‌రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, మాడిశెట్టి మహేష్, పోలుక అనంద్, పోతుగంటి శ్రీనివాస్, తేళ్ల పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లోని మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్‌లో మహర్షి హై స్కూల్ గుర్తింపు రద్దు చేస్తున్నట్లు డీఈవో రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ముస్తాబాద్ ఎంఈవో నివేదిక ప్రకారం నర్సరీ చదువుతున్న చిన్నారి మనోజ్ఞ ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు టైర్ కిందపడి అక్కడికక్కడే మరణించిందని, ఈ సంఘటన స్కూల్ బస్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్, మహర్షి హై స్కూల్ మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యపు వైఖరి కారణంగా జరిగినట్లు తేలిందని పేర్కొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు మాకే ఇవ్వాలి



చైర్ పర్సన్‌కు మొరపెట్టుకుంటున్న లబ్ధిదారులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం తమ భూములను తీసుకొని నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను తమకే ఇవ్వాలని సిరిసిల్ల అంబేద్కర్ నగర్ వాసులు డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఆందోళన చేపట్టారు. కొందరు కౌన్సిలర్ల ప్రోత్సాహంతో కొన్ని వార్డులకు చెందిన వేరు వేరు సామాజిక వర్గాల ప్రజలు శాంతినగర్ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి వెళ్లడంతో అంబేద్కర్ నగర్ వాసులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా అంబేద్కర్‌నగర్ వాసులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా భూమి ఇచ్చిందని ఆ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను కట్టుకున్నామని అన్నారు. అక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ఉండలేక పోయామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఆ భూమిలో మూడు ఎకరాలు నర్సింగ్ కళాశాల, అంబేద్కర్ భవనం నిర్మాణానికి ఇస్తే మిగతా భూమిలో తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ మేరకు ఇచ్చామన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించాక ఇతరులకు ఇచ్చి గందరగోళం సృష్టిస్తున్నారని ఆరోపించారు.

సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల శాంతినగర్ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు సమస్యను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. శాంతినగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న లబ్ధిదారులను అంబేద్కర్‌నగర్ వాసులు ఖాళీ చేయించడంతో వారు ఆర్డీవోకు, చైర్ పర్సన్‌కు మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో భాగంగా నాలుగో విడతగా శాంతినగర్‌లో కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం, కలెక్టర్ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు.

జానపద కళలకు నిలయం తెలంగాణ

గణేశ్‌నగర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతం జానపద కళలకు, సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని, ఆ కళల వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ ప మేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ- సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ఉత్సవ్-2024కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ, బోనాలు మొదలైన పండుగలు జానపదుల జీవన విధానంతో ముడిపడి ఉన్నాయన్నారు. ఇక్కడి జానపద కళలన్నీ ఈ నేలను సుసంపన్నం చేసాయని, తెలంగాణ జాతి వారసత్వాన్ని తెలిపే విధంగా ఉంటాయని ప్రశంసించారు. డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మక నైపుణ్యాలను, కళలను వెలికితీయడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సిరిసిల్ల నుంచి శబరిమలైకి మహాపాదయాత్ర



మహాపాదయాత్ర చేపట్టిన అయ్యప్ప దీక్షదారులు

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల నుంచి శబరిమలైకి అయ్యప్ప భక్తులు గురువారం మహాపాదయాత్రను ప్రారంభించారు. సిరిసిల్ల పట్టణంలోని హరిహరిపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో పాదయాత్ర చేస్తున్న వారికి ఆలయ కమిటీ అధ్యక్షుడు గురుస్వామి రాచ విద్యాసాగర్ అయ్యప్పమాలలు వేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప దీక్షదారులు చేస్తున్న మహాపాదయాత్రకు గురుస్వామి రాచ విద్యాసాగర్‌తోపాటు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. ఈ మహాపాదయాత్రలో గురుస్వాములు గడ్డం భగవాన్, ప్రయాకర్‌రావు మదుసుదన్, గడ్డం భాస్కర్, ఆడేపు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకం



భాను కృష్ణ



వేణుగోపాల్



పసుల కృష్ణ



కళ్యాణ్‌చక్రవర్తి

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన నలుగురు ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకమయ్యారు. వేములవాడ జూనియర్ సివిల్ కోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా పుప్పాల భాను కృష్ణ, సిరిసిల్ల జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా టి. కళ్యాణ్‌చక్రవర్తి, సిరిసిల్ల సీనియర్ సివిల్ కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా చౌటపల్లి వేణుగోపాల్, సిరిసిల్ల జూనియర్ సివిల్ కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ)గా పసుల కృష్ణను నియమిస్తూ లా సెక్రెటరీ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పుప్పాల భానుకృష్ణ బీఏ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 2013లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. వేములవాడ బార్ అసోసియేషన్‌లో మెంబర్‌గా చేరి 11ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అంతకుముందు రంగారెడ్డి జిల్లాకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణానికి చెందిన టి.కళ్యాణ్‌చక్రవర్తి ఎంఏ, ఎల్ఎల్‌బీ చేసి 2007లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా నమోదు చేసుకొని 17ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చౌటపల్లి వేణుగోపాల్ బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 2017లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ చేసుకొని సిరిసిల్ల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా చేరి ఏడేళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన పసుల కృష్ణ ఎమ్మెస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 2016లో బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ చేసుకున్నారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా చేరి ఎనిమిదేళ్లుగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వీరందరు మూడేళ్లపాటు ముగ్గురు సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీ)గా, ఒకరు ప్రభుత్వ న్యాయవాది(జీపీ)గా కొనసాగుతారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివా‌స్‌కు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డికి నలుగురు ఏజీపీలు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, ప్యాక్స్ చైర్మన్

తంగళ్లపల్లి/ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 17: సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్, గండిలచ్చపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాసు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. తహసీల్దార్ జయంత్ కుమార్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, ప్యాక్స్ డైరెక్టర్లు కొమ్మెట పర్శయ్య, బండి దేవేందర్ యాదవ్, గడీల సురేష్, శనిగరం లక్ష్మీ, ఏఎంసీ డైరెక్టర్లు పొన్నాల పర్శరాములు, ఆరేపల్లి బాలు, దుబాల వెంకటేశం, అనుముల శైలజ, గుగ్గిల రాములు, ఆడెపు జగన్, నక్క నర్సయ్య పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్యలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, పదిర, తదితర గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని గురువారం స్థానిక నాయకులతో కలిసి వారు పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా చూస్తామని పేర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో సెల్ ఫోనులో మాట్లాడి తడిసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దాంతో స్పందించిన ఖీమ్యానాయక్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అకాల వర్షాల నేపథ్యంలో కేంద్రాల నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు గౌస్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్లయ్య, వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో అవగాహన సదస్సు

గంభీరావుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం లింగన్నపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. మానసిక సమస్యలతో బాధ పడుతున్న వారు టోల్ ఫ్రీ నంబరు 14416కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేష్, సూపర్ వైజర్లు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వేములవాడ రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రూరల్ మండలంలోని లింగంపల్లి, హన్మాజిపేట గ్రామాల్లో మరణించిన బుచ్చి రామవ్వ, విక్కుర్తి దిలీప్, సూర అనీల్ కుటుంబాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అద్దె భవనాల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

వేములవాడ, అక్టోబర్ 17 : రాష్ట్రంలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలల అద్దె బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లింపులు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల యాజమానులు గత 12 నెలలు నుండి తమకు అద్దె చెల్లించడం లేదని అద్దె చెల్లించకపోవడంతో తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని భవన యజమానులు చేసేది ఎమి లేక తాళాలు వేస్తున్నామని అంటున్నారని ఆయన తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థుల పక్షాన కోరుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు యాజమాన్యాలు తాళాలు వేశారు. సుమారు 9 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ భవనాల యజమానులు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టళ్లకు తాళాలు వేశారు. దీంతో దసరా సెలవుల అనంతరం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటే ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఒక్కప్రక్క ఇంటిగ్రేడెడ్ గురుకులాలు అంటూనే ఉన్న గురుకులాలు సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోవడం సరికాదన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలు ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యంలో తాళాలు వేయడంతో మరింత సమస్యలు తీవ్రతరం అవుతాయని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ వేములవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సామల్ల సాయి భరత్, కడారి శివ, నాయకులు అఖిల్, చందు, సాయి కుమార్, ప్రభాస్, విజేంద్ర, శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

బకాయిల భారం తీర్చండి

- డిగ్రీ కళాశాలల యజమానుల ఆందోళన బాట
- మూడేళ్లుగా అందని ఫీజు రీయింబర్స్‌మెంట్
- కళాశాలలకు రూ.20.37 కోట్ల బకాయిలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

విద్యార్థులకు ఉన్నత చదువులకు ప్రభుత్వం అందిస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ఉన్నత చదువులకు ఊతమిస్తున్నా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు భారంగా మారింది. మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదలవకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 16 డిగ్రీ కళాశాల యజమాన్యాలు కళాశాలలను నిరవధికంగా బంద్ చేసి నిరసన తెలుపుతున్నాయి. అధ్యాపకుల వేతనాలు చెల్లించలేక నిత్యం అవసరమయ్యే మెయింటేనెన్స్ కింద ఖర్చులు కూడా వేలల్లో ఉండడంతో ఆ భారాన్ని మోయలేక కళాశాలలను నిర్వహించలేమని బంద్ చేశాయి. దీంతో జిల్లాలోని 3 వేల మంది విద్యార్థుల భవిష్యత్ ఇబ్బందికరంగా మారే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకుండా యాజమాన్యాలు ఆందోళనలు కొనసాగిస్తే విద్యార్థుల చదువుల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కళాశాలల్లో చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చిన తరువాత తిరిగి ఇచ్చే విధంగా ఫీజులు వసూలు చేస్తున్నారు.

● జిల్లాలో రూ.20.37 కోట్ల బకాయిలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో డిగ్రీకళాశాలలకు ప్రభుత్వం నుంచి 2021 - 2022, నుంచి 2022 - 2023. 2023 -2024 వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ నుంచి రూ.20.37 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బీసీ సంక్షేమ శాఖ స్టూడెంట్ నుంచి మెయింటెనెన్స్‌కు సంబంధించి (ఎంటీఎఫ్) రూ.62.25 లక్షలు, ఎంటీఎఫ్ (నాన్ ప్రొఫెషనల్) ఫీజు రూ.4.03 కోట్లు, ఆర్‌టీఎఫ్ ఫీజు రూ.4.04 కోట్లు, ఆర్‌టీఎఫ్ (నాన్ ప్రొఫెషనల్) ఫీజు రూ. 11.02 కోట్లు, ఈబీసీ ఆర్టీఎఫ్ రూ.21.50 లక్షలు, నాన్ ఆర్టీఎఫ్ రూ.44 లక్షలు ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉంది. వీటితో పాటు ఎస్సీ సంక్షేమ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖల నుంచి మరో రూ.5 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉన్నాయి. బకాయిలు పెరగడంతోనే నిర్వహణ కష్టసాధ్యమై డిగ్రీ కళాశాలల యజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- కొలనూరి శేఖర్‌గౌడ్, కో ఆర్డినేటర్, ఎస్‌యూపీఎంఏ



డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి. అప్పులు తీర్చ లేక ఇబ్బందులు పడుతూ ఏటా వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి. కళాశాలల మూసి వేతతో విద్యార్థులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారు నష్టపోతున్నారు.

కళాశాలలు నడపలేకపోతున్నాం

గుగ్గిళ్ల జగన్‌గౌడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో కళాశాలలు కొనసాగించలేకపోతున్నాం. కళాశాలలు నష్టాల్లో కూరుకుపోయాయి. సిబ్బందికి వేతనాలు ఇవ్వని పరిస్థితి కళాశాలల మెయింటేనెన్స్ కూడా ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లోనే ఆందోళన బాట పట్టాల్సి వచ్చింది. బకాయిలు విడుదల చేసి చేయూతను అందించాలి.